నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 16 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

పండ్ల వ్యాపారులపై జులుం ప్రదర్శించొద్దు

- ఎఫ్టీఎల్ జోన్‌లో ఉన్న బస్టాండ్‌ను వెంటనే తొలగించండి
- పేదలకు ఒక న్యాయం.. మీకో న్యాయమా..?
- ఆర్టీసీ అధికారులపై మండిపడిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సమస్య వివరిస్తున్న వ్యాపారులు

మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 15 : రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అలాంటి పేద వ్యాపారులపై ఆర్టీసీ అధికారులు జులుం ప్రదర్శించి బుల్డోజర్లతో వారి మీదకు రావడం ఏమిటని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌పై ఆధారపడి జీవిస్తున్న ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారుల తోపాటు చిరు వ్యాపారుల కుటుంబాలను మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా పండ్ల వ్యాపారుల ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ చిరు వ్యాపారాలు చేసుకొని బతుకుతున్న వారిపై ఇలాంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. పేద పండ్ల వ్యాపారాలను తొలగించాలంటే ముందుగా ఎఫ్టీఎల్ జోన్‌లో బస్టాండ్ ఉందని, వెంటనే బస్టాండ్‌ను తొలగించండి.. పేదలకు ఒక న్యాయం.. మీకో న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. బస్టాండ్ ముందు ఉంటేనే వాళ్ల వ్యాపారాలు జరిగి కుటుంబ పోషణ చేసుకునే అవకాశం ఉందన్నారు. వ్యాపారులు ఇక్కడే కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలా కాదని తొలగింపు ప్రక్రియ చేపడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, అవసరమైతే అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అవసరమైతే పండ్లు అమ్మకం చేసేందుకు ఆర్టీసీ నిర్మాణం చేసిన దుకాణాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. గతంలో ఇదే ప్రాంతంలో అత్యాధునిక పండ్ల మార్కెట్ కట్టాలని నిర్ణయం తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిచామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం, అధికారులకు పేదల పండ్ల షాపులు ఇబ్బందిగా అనిపిస్తే ప్రతిపాదనలకు అవసరమైన నిధులు తీసుకువచ్చి కొత్త మార్కెట్ నిర్మాణం చేయాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచనతో వెయ్యి పడకల దవాఖాన నిర్మాణం చేసినట్లు తెలిపారు. దీంతో వీరి వ్యాపారాలు కూడా చక్కగా సాగుతున్నాయని వివరించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, సీనియర్ నాయకులు రాంలక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

- సీఎం రేవంత్‌రెడ్డి రెండు కండ్ల అభివృద్ధి ఎటుపోయింది?
- అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను తరలిస్తే ఆందోళన తప్పదు
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో అన్నీ కబ్జాలు, కహానీలే..

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, జూన్ 15 : 18 నెలల కాంగ్రెస్ పాలనలో నారాయణపేట నియోజకవర్గంలో కబ్జాలు, కహానీలు తప్పా ఒక్కటంటే ఒక్కటి కొత్తగా అభివృద్ధి పని జరగలేదు.. సరి కదా తాను మంజూరు చేయించుకొచ్చిన వాటిని కూడా ఇక్కడి నుంచి పోకుండా కాపాడుకోలేక పోవడం చాలా బాధాకరమని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి విమర్శించారు. నారాయణపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు తీసుకువచ్చిందే తానేనని ఇటీవల చెప్పుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే, తీరా నారాయణపేట నుంచి దవాఖాన తరలించిన తర్వాత ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత దృష్ట్యా గత ఎమ్మెల్యేనే జిల్లా దవాఖానను దూరంగా ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే చెప్పడం చూస్తుంటే 'మంత్రం పని చేస్తే తనది.. పని చేయకుంటే నాది కాదు నీది' అన్నట్లుగా ఉందన్నారు. 'ఎస్' గౌరవంగా చెప్పుకుంటున్న జిల్లా దవాఖాన తీసుకువచ్చిందే తానేనని, మెడికల్ కళాశాల తీసుకువచ్చిందే కూడా తానేనని అన్నారు. నారాయణపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కడా మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, జిల్లా దవాఖాన ఏర్పాటుకు పెద్ద మొత్తంలో అనువైన స్థలాలు లేకపోవడంతో అప్పంపల్లి వద్ద అనుకూలంగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేయించినట్లు తెలిపారు. నారాయణపేట జిల్లా దవాఖానకు రూ. 56కోట్లు మంజూరు చేయిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 05-07-2023న జీవో నెంబర్ 81ద్వారా ఉత్తర్వులు జారీ చేయించడం జరిగిందన్నారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా జిల్లా దవాఖానకు శంకుస్థాపన చేయించి నిర్మాణ పనులను వేగవంతం చేయించినట్లు చెప్పారు. అంతేకాకుండా నారాయణపేట మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయిస్తూ తేదీ 16.09.2023 జీవో నెంబర్ 162 ద్వారా ఉత్తర్వులు జారీ చేయించారన్నారు. ప్రస్తుతం ఉన్న ఏరియా దవాఖాన స్థానంలో ప్రసవ, చిన్నపిల్లల దవాఖాన కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు లేఖ కూడా అందజేసినట్లు తెలిపారు. అందుకే ప్రస్తుత ప్రభుత్వంలో మంజూరైన ప్రసవ, చిన్నపిల్లల దవాఖానని పట్టణంలో అందరికీ సౌకర్యంగా ఉండే ఏరియా దవాఖాన స్థానంలోనే నిర్మించాలని ప్రజల తరఫున డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఉన్న ఫలంగా నారాయణపేటలో కనీసం ఓపీ సేవలు కూడా లేకుండా మొత్తం దవాఖానని తరలించడం చాలా దారుణమని, శిథిలావస్థకు చేరిన ఏరియా దవాఖానని పక్కన పెట్టి, తాత్కాలిక భవనంలో ఓపీ సేవలు కొనసాగిస్తే పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గత 18 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా కొత్తగా తీసుకొచ్చి అభివృద్ధి చేసిన 9దాఖలాలు లేవు సరికదా తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో తీసుకువచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు ఇతర నియోజకవర్గాలకు తరలి వెళ్తుంటే కనీసం ఆపక పోవడం ఎమ్మెల్యే చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మంత్రులు, అధికారులు ఉండేందుకు కొత్త జిల్లాలో ప్రత్యేకంగా అతిథి గృహం (గెస్ట్ హౌస్) లేక పోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.4 కోట్లతో ఆధునాతన అతిథి గృహం (గెస్ట్ హౌస్) నిర్మించేందుకు గాను సింగారం క్రాస్ రోడ్‌లో స్థలం ఎంపిక చేసి, నిధులు కూడా మంజూరు చేయించి, టెండర్ కూడా వేయించడం జరిగిందన్నారు. ఈ అతిథి గృహాన్ని (గెస్ట్ హౌస్) రద్దు చేసి కొడంగల్ నియోజకవర్గానికి తరలించుకొని వెళ్తే ఎమ్మెల్యే అడ్డు చెప్పుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కోయిల కొండ మండలం రామకొండ ఆలయ అభివృద్ధికి తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో తీసుకొచ్చిన రూ.10 కోట్ల నిధులు వెనక్కి వెళ్తే ఎమ్మెల్యే అడ్డుకోక పోవడం, 18 నెలలు అవుతున్నా ఎస్పీ ఆఫీసు పనులను, స్టేడియం నిర్మాణ పనులను ఇప్పటివరకు మొదలు పెట్టక పోవడం, మరికతో వెటర్నరీ యూనివర్సిటీ ఏర్పాటు కోసం స్థలం ఎంపిక చేసి పెట్టినప్పటికీ, దానిని మంజూరు చేయించుకొని రాకపోవడం ఎమ్మెల్యే బాధ్యతారాహిత్యం అని ఆరోపించారు.

నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలు తనకు రెండు కళ్ల వంటివి అని, కొడంగల్‌కు ఎన్ని నిధులు వస్తాయో అన్ని నిధులు నారాయణపేట కూడా ఇస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం మాత్రం ఒక కన్నుకే పెద్ద పీట వేస్తూ రెండో కన్నును పొడుస్తున్నా స్థానిక ఎమ్మెల్యే ప్రశ్నించకపోవడం సరైనది కాదన్నారు. ఇక సైనిక్ స్కూల్ కోసం లోకపల్లి వద్ద 50 ఎకరాల స్థలం కేటాయించి, రెండు సార్లు కేంద్రానికి మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి విన్నవించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు సైనిక్ స్కూల్ మంజూరు చేయక పోగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరి కోటకొండ, కానుకుర్తి, గార్లపాడ్ మండలాలను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల తరలిస్తే ఆందోళన..

నారాయణపేట జిల్లా కేంద్రంలో తన హయాంలో మంజూరు చేసి, ప్రారంభించిన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను నారాయణపేట నుంచి తరలిస్తే బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నారాయణపేటలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, కళాశాలను తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

ఒండ్రుమట్టి తరలించుకొని సొమ్ము చేసుకొన్నారు

ధన్వాడ, జూన్ 15 : ధన్వాడ ఆడబిడ్డలమంటూ అధికారం అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు 18 నెలల కాలంలో రెండు సార్లు చెరువులోని ఒండ్రుమట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని చర్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ఈ ప్రభుత్వం అవస్థలు పడుతుందన్నారు. ఎన్నికల ముందుకు దివ్యాంగులు, వృద్ధులకు ఇస్తున్న పింఛన్లు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పి 18 నెలలుగా గడిచినా ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక విమర్శలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. రైతులు, ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో నూకలు చెల్లడం ఖాయం అన్నారు. అంతకుముందు విద్యుదాఘాతంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ ఎం.వెంకట్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లప్ప, సునీల్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, భగవంతరెడ్డి, పూర్యానాయక్, నర్సింహరెడ్డి, శాంతకుమార్, ఇర్ఫాన్, నాసర్, దామోదర్‌రెడ్డి, రమేశ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సర్కారు కొన్నది అరకొర ధాన్యమే..
- కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- సగం ధాన్యం వర్షార్పణం
- రెండు నెలలుగా ఊసే లేదు
- నిరాశలో 17వేల మంది రైతులు
- నిధులు రాగానే వేస్తాం : జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం జగన్‌మోహన్



బోనస్.. అందేనా..?

వనపర్తి జిల్లాలో రూ.47కోట్లు పెండింగ్

సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం వాటిని అందించడంలో మాట నిలబెట్టుకోవడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో 17 వేల మంది రైతులు సన్నరకం వడ్లను ప్రభుత్వానికి విక్రయించారు. ఈ రైతుల నుంచి దాదాపు 97వేల మెట్రిక్ టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేశారు. అయితే.. వీరిలో ఒక్క రైతుకు కూడా బోనస్ డబ్బులు రాలేదు. దాదాపు రూ.47 కోట్ల బోనస్‌ను ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. వానకాలం సీజన్‌లో ఆలస్యంగా బోనస్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు యాసంగి సీజన్‌లో ఒక్క రైతుకు బోనస్ ఇవ్వకపోవడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. మే నెలలో ధాన్యం అమ్ముకున్న రైతులు ఎప్పుడు బోనస్ పడుతుందంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

రెగ్యులర్‌గా ఇచ్చే డబ్బులకు అవస్థలే..

యాసంగిలో వరి ధాన్యం అమ్ముకున్న రైతులు ఒక్కొక్కరు ఒక్కొక్క కష్టాన్ని.. నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సీజన్‌లో పడ్డంత ఇబ్బంది గతంలో ఎప్పుడూ చూడలేదని స్వయంగా రైతులే చెబుతున్నారు. తూకం వేసిన అనంతరం లారీలు లేవని వారం రోజులు బ్రేక్, మిల్లులకు తరలించినా తర్వాత ధాన్యం సరిగా లేదని మరో 10 రోజులు నిలుపుదల, చివరకు అన్ని అయినా డబ్బులు ఇవ్వడంలో నరకం చూపెడుతున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. బోనస్‌తోపాటు ధాన్యం అమ్మిన డబ్బులను కూడా పెండింగ్ పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి తక్షణ చర్యలు రాకపోవడం.. మిల్లర్లు సహకరించకపోవడంతో రైతులకు వెంటనే అందాల్సిన డబ్బులు కూడా చేరడం లేదు. కాగా, బోనస్ సంగతి అటుంచితే.. జిల్లాలో రూ.80 కోట్లు రైతులకు అందాల్సి ఉన్నది.

సర్కారు కొన్నది సగం ధాన్యమే..

జిల్లాలో యాసంగిలో 3.70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం లక్ష్యం పెట్టుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అనుకున్న మేర లక్ష్యాన్ని అందుకోలేక పోయింది. ఇందు కోసం ప్రభుత్వం 481 కొనుగోళ్ల సెంటర్లను ఐకేపీ, పీఏసీసీఎస్, మెప్మాల నుంచి ఏర్పాటు చేసింది. ఇలా ఈ సెంటర్ల ద్వారా సగం ధాన్యం కూడా కొనుగోళ్లుచేయలేక పోయాలన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ సెంటర్ల ద్వారా మొత్తం 2లక్షల 65వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రారంభంలో సెంటర్లు ప్రారంభించక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మద్దతు ధరకు సమానంగా ప్రైవేట్‌లో కూడా వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రభుత్వానికి మిల్లర్ల సమస్య.. గోడౌన్ల కొరతలులాంటివన్ని కొనుగోళ్లలో సమస్యలను తెచ్చిపెట్టాయి. ఈ సమస్యల మధ్యలో ప్రైవేట్ వ్యాపారులు రంగంలోకి దిగారు. బోనస్‌కు ఎదురు చూడకుండా అధిక శాతం రైతులు ప్రైవేట్ వారికే సన్నరకం ధాన్యాన్ని విక్రయించుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ కొనుగోళ్ల లక్ష్యం సగానికి అటు.. ఇటుగా మిగిలిపోయాయి.

నిధులు రాగానే వేస్తాం..

బోనస్ డబ్బులు ఇప్పటి వరకు యాసంగి సీజన్‌లో రాలేదు. త్వరలోనే వస్తాయని భావిస్తున్నాం. రాగానే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తాం. కొంత ఆలస్యమైంది. నిధులకు సంబంధించిన విషయంలో తాము చేసేదేమి లేదు. డబ్బులు వస్తే మాత్రం ఎక్కడా పెండింగ్ లేకుండా రైతుల అకౌంట్లలో పడేలా చూస్తాం.

– జగన్‌మోహన్, డీఎం, జిల్లా పౌరసరఫరాల శాఖ, వనపర్తి

సన్నరకం సాగు చేస్తే మద్దతు ధరతో పాటు రూ.500ల బోనస్ ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ సర్కారు రైతులకు ఎగనామం పెట్టింది. సీఎం, మంత్రులు బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పారని రైతులు మండిపడుతున్నారు. వనపర్తి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరినా డబ్బులు అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ధాన్యం విక్రయాల వెంటనే రెండు, మూడు రోజుల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పడమే కానీ.. అమలు కావడం లేదు. రైతులు వీటి కోసం నెలల తరబడి ఎదురు చూసే పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో 2లక్షల 65వేల మెట్రిక్ టన్నుల ధాన్యంను యాసంగిలో ఐకేపీ, పీఏసీసీఎస్, మెప్మాల ద్వారా కొనుగోలు చేశారు. రెండు నెలల నుంచి కొనుగోలు ప్రక్రియ జరుగుతుండగా, ఒకటి, రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయనున్నారు.

– వనపర్తి, జూన్ 15 (నమస్తే తెలంగాణ)

ధాన్యం అమ్మి 26 రోజులైంది..

25 రోజుల కిందట సన్నరకం ధాన్యం గోపాల్‌పేట సింగిల్‌విండో కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న. బోనస్ డబ్బులు మాత్రం ఇప్పటి వరకు రాలేదు. 295 క్వింటాళ్ల ధాన్యం అమ్మిన. రూ.1,47,500 బోనస్ రావాలి. ఇంకా ఎన్ని రోజులు ఎదురు చూడాలి. యాసంగి సీజన్ పోయి వానకాలం సీజన్ వచ్చింది. అధికారుల చుట్టూ తిరిగినా ఇప్పుడు అప్పుడంటూ దాటవేస్తున్నారు. ఎవరు భరోసా ఇవ్వడం లేదు. సక్రమంగా ఇవ్వలేనప్పుడు చెప్పడ మెందుకు, రైతులను ఇబ్బందికి గురిచేయడం ఎందుకు. సన్న రకం పెట్టాలని చెప్పింది మీరే, బోనస్ ఇస్తామన్నది మీరే. తీరా డబ్బుల వరకు వచ్చే సరికి నరకం చూపెడుతున్నారు.

- గంటా రాంరెడ్డి, రైతు, గోపాల్‌పేట మండలం

అసలు డబ్బులు కూడా రాలే..

నేను దొడ్డు వడ్లు అమ్ముకుని 15 రోజులైంది. ఇంత వరకు డబ్బులు రాలేదు. వడ్లు కొన్న కేంద్రం వాళ్లను అడిగితే వస్తాయి.. మా చేతుల్లో ఏమీ లేదంటున్నారు. సర్కారు వేసినప్పుడే డబ్బులు వస్తాయని చెబుతున్నారు. 45 క్వింటాళ్లు ఐకేపీ సెంటరులో అమ్మినా. డబ్బులు వస్తే.. అప్పులైనా కట్టుకుందామంటే రావడం లేదు. ఎప్పుడు వస్తావో ఎవరూ చెప్పడం లేదు. ఎన్ని రోజులు ఎదురు చూడాలే. వడ్లు అమ్మినం కానీ.. డబ్బులు రావడం లేదు. ఏ పని చేసుకోవాలన్నా డబ్బులు కావాలే. మేం తెచ్చుకున్న చోట టైంకు డబ్బులు కట్టక పోతే మా మాటలు పోతున్నాయి. మమ్మల్ని అవస్థలు పెట్టడం సరికాదు. తొందరగా డబ్బులు వేసి మా బాధ తీర్చండి.

- శివమ్మ, మహిళా రైతు, కేతేపల్లి, పాన్‌గల్ మండలం

సాయిచంద్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

సాయిచంద్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజిని

- 29న సాయిచంద్ విగ్రహావిష్కరణ
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు

అమరచింత, జూన్ 14 : తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ దివంగత సాయిచంద్ కాంస్య విగ్రహాన్ని అమరచింత పట్టణంలో ఏర్పాటు చేసేందుకు ఆయన సతీమణి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ కళాకారులు, సాయిచంద్ అభిమానులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 29న సాయి చంద్ 3వ వర్ధంతి సందర్భంగా సాయి చంద్ జన్మించిన అమరచింతలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన కార్యచరణపై చర్చించారు. అనంతరం రజినీసాయి చంద్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న సాయిచంద్ ఏడడుగుల కాంస్య విగ్రహాన్ని కొత్త బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామని, కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, పట్టణాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు నాగ భూషణంగౌడ్, లెనిన్, సాయిచంద్ అభిమానులు శేఖర్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

- జూరాలకు ఇన్‌ఫ్లో 20వేలు, అవుట్ ఫ్లో 21,677 క్యూసెక్కులు
- టీబీ డ్యాం ఇన్‌ఫ్లో 8,585, అవుట్‌ఫ్లో 178 క్యూసెక్కులు
- ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 5,455, అవుట్‌ఫ్లో 5,131 క్యూసెక్కులు

అయిజ, జూన్ 15 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నెట్టింపాడ్ ఎత్తిపోతల పథకం1500, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 315, విద్యుత్ ఉత్పత్తికి19,805 క్యూసెక్కులు విడుదల చేయగా మొత్తం అవుట్ ఫ్లో 21,677 క్యూసెక్కులు నమోదైంది. పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.019 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 8,585 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 178 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠ నీటి మట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1603.82 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 26.873 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో 5,455 క్యూసెక్కులు ఉండగా, దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 5,131 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 324 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం 8.7 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.

తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

- కుటుంబతగాదాలే కారణంగా అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అనూష (ఫైల్)

జడ్చర్లటౌన్, జూన్ 15 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా సమీపంలోని బొవెలకుంట రహదారి పక్కన 3 అంతస్తుల భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్లలోని బోవెలకుంట రహదారి పక్కన ఓ మూడు అంతస్తుల భవనంపై అనూష(30), ఆంజనేయులు దంపతులు అద్దెకు ఉంటున్నారు. వీరికి ముగ్గురు మగ సంతానం. పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పనిచేస్తున్న అనూష ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో క్షణికావేశంలో 3 అంతస్తుల పైనుంచి కిందికి దూకింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలు తగలటంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా భార్యాభర్తల మధ్య సంసార విషయంలో గొడవ చోటుచేసుకోవటంతో అనూష భవనంపై నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడిట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికురాలు, డ్రైవర్‌కు మధ్య గొడవ
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

జడ్చర్లటౌన్, జూన్15 : ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలికి, డ్రైవర్‌కు మధ్య మాటా మాట పెరిగి గొడవకు దారితీసి చివరకు ఇరువురు పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరిన ఘటన ఆదివారం జడ్చర్లలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వెళ్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో జడ్చర్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద జడ్చర్లకు చెందిన ఓ మహిళ ఎక్కింది. బస్సులో ప్రయాణికుల రద్దీ ఉండడంతో సదరు మహిళ మెట్ల వద్ద నిల్చుండడంతో బస్సు డ్రైవర్ సదరు ప్రయాణికురాలిని బస్సులోపలికి తొక్కాలంటూ చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలో డ్రైవర్‌కు, సదరు ప్రయాణికురాలికి మధ్య మాటామాట పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో బస్సుడ్రైవర్ నేరుగా బస్సును జడ్చర్ల పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకొచ్చి ఆపాడు. ఆ తర్వాత సదరు ప్రయాణికురాలు తనపై దుర్భాషలాడిట్లు పేర్కొంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మరొవైపు తనపై బస్సు డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడని స